క్లుప్తంగా

రైతులంతా పంటల బీమా చేయించుకోవాలి

సంతనూతలపాడు: ఖరీఫ్–2025లో పంటలు సాగుచేస్తున్న రైతులంతా తమ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి పి.పావని శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో వరి పంటను గ్రామం యూనిట్‌గానూ, కంది, సజ్జ, ఎండుమిరప పంటలను మండల యూనిట్‌గానూ, మినుము, నువ్వులు పంటలను జిల్లా యూనిట్‌గానూ గుర్తించామన్నారు. పత్తి పంటను వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ప్రకటించారన్నారు. రైతులు తమ ఆధార్, పొలం పాస్ పుస్తకం లేదా కౌలుదారు కార్డు, పంట సాగు ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా పుస్తకం జెరాక్స్ కాపీలతో దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) లేదా సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ ద్వారా పంటల బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చని తెలిపారు. ప్రీమియం చెల్లించేందుకు వరి పంటకు ఆగస్టు 15, పత్తి పంటకు జూలై 15, మిగతా అన్ని పంటలకు జూలై 31 ఆఖరి తేదీలుగా తెలిపారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్సీలకు శ్మశానం నిమిత్తం స్థలాల పరిశీలన

సంతనూతలపాడు: మండలంలోని ఎం.వేములపాడు గ్రామంలో ఎస్సీలకు శ్మశానం నిమిత్తం ఆ గ్రామంలోని సర్వే నంబర్ 201లో ముసి పరివాహక ప్రాంతంలోని పొలాలను తహసీల్దార్ ఎస్.ఎల్.నారాయణరెడ్డితో కూడిన బృందం శుక్రవారం పరిశీలించింది. గ్రామ వీఆర్‌ఓ షేక్ ముంతాజ్, నాయకులు పాల్గొన్నారు.

కిల్కారి కాల్స్‌తో గర్భిణులకు ప్రయోజనం



కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

చీమకుర్తి రూరల్: కిల్కారి కాల్స్‌ను గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవాలని, వాటి వలన మహిళలకు ప్రయోజనం ఉంటుందని కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ రాజు తెలిపారు. మండలంలోని బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 01244451660 నంబర్ ద్వారా గర్భిణులు, బాలింతలకు తల్లీబిడ్డకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందించబడుతుందన్నారు. ఈ సమాచారాన్ని మళ్లీ వినాలంటే 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వినవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి హరిణి, డాక్టర్ నవీన్, బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి



నివాళులర్పిస్తున్న ఎంపీ మాగుంట, కాపు సంఘ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రంగా విగ్రహానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కాపు సంఘ అధ్యక్షుడు కె.సంజీవరావు అధ్యక్షత వహించగా, మున్సిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, అయినాబత్తిన ఘనశ్యాం, ఎస్.శ్రీనివాసరావు, ఎన్.సాంబయ్య, కార్పొరేటర్ పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలగకూడదు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రజియా సుల్తానా

నాగులుప్పలపాడు: గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉండాలని, శాంతి భద్రతలకు భంగం కలగకుండా రాజకీయ పార్టీల నాయకులు, పెద్దలు సహకరించాలని ఎస్సై రజియా సుల్తానా కోరారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి మాచవరం గ్రామంలో ఆమె నిద్రించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పలు అంశాలపై చర్చించారు. గ్రామంలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలు బాగుండాలంటే గ్రామస్తుల సహకారం అవసరమని తెలిపారు.

జోరుగా మట్టి దందా

- సంతనూతలపాడు చిన్న చెరువులో అక్రమంగా మట్టి తవ్వి తరలింపు
- చెరువులో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకర పరిస్థితులు
- రేయింబవళ్లు వాహనాల ద్వారా మట్టి తరలింపుతో పెద్ద ఎత్తున కాలుష్యం
- శబ్ద, వాయు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నామంటూ స్థానికుల ఫిర్యాదు



సంతనూతలపాడు చిన్న చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

సంతనూతలపాడు: రేయింబవళ్లు భారీ వాహనాల రాకపోకలతో శబ్దాలు.. రోడ్డంతా గుంతలు.. స్థానికంగా ఉన్న ఇళ్ల నిండా దుమ్మూధూళి.. శబ్ద, వాయు కాలుష్యంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు.. ఇవన్నీ సంతనూతలపాడు చిన్న చెరువులో జోరుగా సాగుతున్న మట్టి దందాతో తలెత్తుతున్న సమస్యలు. కొందరు అక్రమార్కులు చెరువులో అక్రమంగా మట్టి తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటుండటంతో చెరువులో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. మట్టి, గ్రావెల్ నిమిత్తం ఇష్టానుసారంగా జేసీబీల ద్వారా కొందరు వ్యాపారులు అక్రమంగా తవ్వకాలు చేపట్టారు. కొన్ని రోజులుగా నిబంధనలకు విరుద్ధంగా చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. రాత్రీపగలూ తేడా లేకుండా 10 నుంచి 15 అడుగుల మేరకు తవ్వుతూ ప్రమాదకరంగా గుంతలు తీస్తున్నారు. పొలాలకు వెళ్లే దారి కావడంతో రైతులు, పశువులకు ప్రమాదాలు పొంచి ఉన్నప్పటికీ పట్టించుకోవాడం లేదు. చెరువులో తవ్విన మట్టిని తరలిస్తున్న వాహనాల రాకపోకల కారణంగా ఆ రహదారి మొత్తం గుంతలమయంగా మారుతోంది. భారీ వాహనాలతో మట్టి తరలించడం వల్ల రోడ్లన్నీ పాడైపోయి దుమ్మూధూళి ఇళ్లలోకి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దుమ్ము కారణంగా తమకు దగ్గు, ఆయాసం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చిన్న చెరువు పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారడంపై స్థానికులంతా ఆందోళన చెందుతున్నారు.

మైనర్ ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్‌కు ఫిర్యాదు...

సంతనూతలపాడు చిన్న చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకుని రైతాంగం, స్థానిక ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాలని సంతనూతలపాడుకు చెందిన చెరుకూరి అరుణ శుక్రవారం మైనర్ ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై పలు పర్యాయాలు పంచాయతీ వారికి ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆమె ఆరోపించారు. కొన్ని రోజులుగా జరుగుతున్న మట్టి దందా గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం అధిక సంఖ్యలో భారీ వాహనాలతో మట్టి తరలిస్తుండటం వలన స్థానికులకు ఎంతో అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వి పొలాలకు కాకుండా వెంచర్లకు తరలిస్తూ వేల రూపాయలు దండుకుంటూ వ్యాపారం చేస్తున్నారని స్థానికులు సైతం వాపోయారు. దీంతో మైనర్ ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి శుక్రవారమే చెరువులో అక్రమంగా మట్టి తవ్వడం కారణంగా ఏర్పడిన భారీ గోతులను పరిశీలించారు. ఇకపై చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే తీసిన గుంతలను పూడ్చివేయాలని హెచ్చరించారు.

క్విస్ కాలేజీ ఫ్యాకల్టీ శ్రీనుకి డాక్టరేట్

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ కళాశాల సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్‌కి చెందిన ఫ్యాకల్టీ నిడమానూరి శ్రీను డాక్టరేట్ అందుకున్నారు. చెన్నైలోని భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నుంచి ఆయన డాక్టరేట్ పొందారు. కస్టమర్ ఫీడ్ బ్యాక్ క్లాసిఫికేషన్ యూజింగ్ బై డైరెక్షనల్ లాంగ్, షార్ట్ టర్మ్ మెమరీ అండ్ ఫజ్జిలాజిక్ అనే అంశంలో డాక్టర్ శివరామన్ గైడ్ షిప్‌లో శ్రీను రీసెర్చ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిడమానూరి శ్రీనును విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి అభినందించారు. కార్యక్రమంలో క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు, సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ బుజ్జిబాబు పాల్గొన్నారు. పీహెచ్‌డీ చేసేందుకు సహకరించిన కాలేజీ యాజమాన్యానికి, హెచ్‌వోడీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



డాక్టరేట్ పొందిన శ్రీనును అభినందిస్తున్న క్విస్ కాలేజీ అధినేత సూర్యకళ్యాణ్ చక్రవర్తి

రైతు సెమినార్‌ను జయప్రదం చేయాలి

సంతనూతలపాడు: ఒంగోలులోని బృందావనం కళ్యాణ మండపంలో ఈ నెల 5వ తేదీ నిర్వహించనున్న రైతు సెమినార్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో రైతు సంఘ నాయకులు శుక్రవారం ప్రచారం చేశారు. రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బూరి వెంకటేశ్వర్లు ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసుకుంటూ అప్పుల ఊబిలోకి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి రైతులు పండించే పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రైతులంతా ఐక్యంగా ఉండి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు సాధించుకోవాలని ఆయన కోరారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన రైతు సెమినార్లో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, రైతు సంఘ జిల్లా నాయకుడు కిలారి పెద్దబ్బాయి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

జగనన్న హయాంలో ప్రతి ఒక్కరికీ పథకాలు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ:

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎన్నికల హామీలు అమలు చేయకపోగా, టీడీపీ వర్గీయులకే పనులు చేసుకుంటున్నారని విమర్శించారు. ఒంగోలు నగరంలోని 29వ డివిజన్ రాజాపానగల్ రోడ్డు 10వ లైన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు పార్టీ బలోపేతానికి సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో పేదలకు సంక్షేమ పథకాలను జగనన్న అందజేసిన విషయాన్ని ప్రజలకు వివరించాలని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనపై అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మరోసారి జగనన్నను సీఎం చేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు జాకిర్‌హుస్సేన్, నాయకులు దామరాజు క్రాంతికుమార్,వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, దాసరి కరుణాకర్, బుజ్జి, వాణి, అప్సరబేగం, ప్రసన్న, జనార్దన్, మురళి, మస్తాన్‌వలి, సుభాని, అర్షద్, ఆరిఫ్, పరిజన్, సింధూజ, కరీముల్లా, నాగూర్, షఫీ, అఖిల్, గౌస్, షెన్నా, చిన్నా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

అల్లూరి సీతారామరాజు ఆశయాలు కొనసాగించాలి



కొత్తపట్నం హైస్కూల్లో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపట్నం: అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు ఆశయాలు కొనసాగించాలని కొత్తపట్నం బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పాఠశాలలో శుక్రవారం అల్లూరి 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ కోటేశ్వరరావు అల్లూరు సీతారామరాజు చిత్రపటాన్ని ఆయన చేతులతో గీచి పాఠశాలకు బహూకరించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చేసిన ఉద్యమాలు, చూపించిన ధైర్యం, త్యాగాల గురించి వివరించారు. స్వాతంత్య్రం కోసం ఆయన చేసిన త్యాగం మరువలేనిదని కొనియాడారు. ఆయన స్ఫూర్తిగా తీసుకుని అందరూ మెలగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ హరిబాబు, పీడీ సాయి కిషోర్, జిలానీ బాషా, రాజ్ కుమార్, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, బాలాజీ, నాగమల్లేశ్వరరావు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో పోరాటాలు చేయాలి

ఒంగోలు టౌన్: దేశంలో జరుగుతున్న విద్యారంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో విద్యార్థులు పోరాటాలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణాల మాట్లాడుతూ అల్లూరి పోరాట స్ఫూర్తిని కీర్తిస్తున్న పాలకులు ఆచరణలో ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. మన్యం గిరిజనుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన అల్లూరి సీతారామరాజు ఆశయాలకు భిన్నంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యంత విలువైన ఖనిజ సంపద ఇనుము, బొగ్గు, బాక్సైట్, లైటరైట్‌లను అదానీ, అంబానీలకు అప్పగించేందుకు ప్రాజెక్టుల పేరుతో అడవి నుంచి గిరిజనులను తరిమేస్తున్నారని చెప్పారు. ప్రశ్నించిన ఆదివాసీలపై కేసులు పెట్టి జైళ్లకు తరలిస్తున్నారని, ఏళ్ల తరబడి గిరిజనులు జైళ్లలో మగ్గిపోతున్నారని చెప్పారు. మన రైతాంగాన్ని, దేశీయ చిన్న పరిశ్రమలను దెబ్బతీస్తున్నారని, కార్పొరేట్ శక్తుల అడుగులకు మడుగులొత్తుతున్నారని మండిపడ్డారు. విద్యార్థి యువజనులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సీహెచ్ వినోద్, విజయ్, ఆనంద్‌బాబు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు

హాస్టళ్లకు దారేదీ..?

- కొత్తపట్నంలో హాస్టళ్లకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక విద్యార్థులకు ఇబ్బందులు

కొత్తపట్నం: స్థానిక హాస్టళ్ల విద్యార్థులు హాస్టల్ నుంచి పాఠశాలలకు రాకపోకలు సాగించే రోడ్డు అధ్వానంగా ఉండటంతో నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో హాస్టళ్లకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. మట్టి రోడ్డు సక్రమంగా లేకపోవడంతో పాటు దారి మధ్యలో విషసర్పాలు సంచరిస్తుండటం వలన ప్రాణాలు అరచేత పట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. కొత్తపట్నంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుకవైపు బాలికల హాస్టల్, కొద్ది దూరంలో ఎస్సీ హాస్టల్ ఉంది. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి హాస్టళ్లకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. రెండు హాస్టళ్ల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటారు. కానీ, రోడ్డు సక్రమంగా లేకపోవడం వలన వర్షం పడితే నీరు నిలిచి నడిచేందుకు కూడా వీలుండటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడి హాస్టళ్లకు తాగునీరు సరఫరా చేయాలన్నా.. వివిధ రకాల మెటీరియల్స్ తీసుకెళ్లాలన్నా అసౌకర్యంగా ఉందని అంటున్నారు. రోడ్డుకిరువైపులా చిల్లచెట్లు పెరిగి ప్రయాణానికి వీలుపడటం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. హాస్టళ్లకు మౌలిక వసతులు లేనందున విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. ఇప్పటికే కొన్ని హాస్టళ్లు మూతపడ్డాయి. అధికారులు స్పందించి హాస్టళ్లకు రోడ్డు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



మట్టి రోడ్డుపై హాస్టల్‌కు వెళ్తున్న విద్యార్థులు

కొణిజేటి రోశయ్యకు అవమానం జరిగిందంటూ నిరసన

ఒంగోలు టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యకు అవమానం జరిగిందంటూ అమరజీవి పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పేరకం నాగాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కొణిజేటి రోశయ్య 93వ జయంతి సందర్భంగా ఒంగోలు నగరంలోని బాపూజీ మార్కెట్ వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్ద మూడు గంటలపాటు మౌనదీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాగాంజనేయులు మాట్లాడుతూ రోశయ్య విగ్రహం చుట్టూ ఉన్న రిటైనింగ్ వాల్, వాటర్ ఫౌంటైన్, లైటింగ్ సిస్టంను గతేడాది డిసెంబర్లో నగరపాలక సంస్థ అధికారులు ధ్వంసం చేశారని తెలిపారు. సరిగ్గా రోశయ్య వర్ధంతి సమయంలో ధ్వంసం చేసిన అధికారులు.. ఏడు నెలల తర్వాత జయంతి సమయానికి కూడా పునరుద్ధరించలేదని చెప్పారు. రోశయ్య విగ్రహం వద్ద ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదన్నారు. పక్కనే ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మాత్రం రూ.10 లక్షలతో మెరుగులు దిద్దుతున్నారని తెలిపారు. ఇదే ప్రాంతంలో ఉన్న మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం జోలికి పోకుండా ఆర్యవైశ్య నాయకుడిగా పేరొందిన రోశయ్య విగ్రహాన్ని మాత్రమే ధ్వంసం చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా రోశయ్యను అవమానించడమేనని భావిస్తున్నట్లు చెప్పారు. రోశయ్య విగ్రహం వలన ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, అక్కడ కల్వర్ట్ నిర్మించాలని రకరకాల సాకులు చెబుతూ విగ్రహాన్ని తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహిస్తుంటే.. ఏపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రోశయ్యను తగిన విధంగా గౌరవించాలని, ఆయన జన్మించిన వేమూరు గ్రామం ఉన్న బాపట్ల జిల్లాకు కొణిజేటి రోశయ్య జిల్లాగా నామకరణం చేయాలని నాగాంజనేయులు డిమాండ్ చేశారు. రోశయ్య విగ్రహం చుట్టూ ధ్వంసం చేసిన రిటైనింగ్ వాల్, వాటర్ ఫౌంటైన్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



రోశయ్య విగ్రహం వద్ద మౌనదీక్ష చేస్తున్న నాగాంజనేయులు

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- పట్టించుకోని అధికారులు

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎదురు రోడ్డు మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభం శిథిలావస్థలో ఉంది. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గ్రామ సచివాలయానికి వెళ్లే దారిలో రోడ్డు వెంబడి ఉన్న ముళ్లచెట్లపై విద్యుత్ తీగలు పడి ఉన్నాయి. పశువులను పొలాలకు తోలుకుని వెళ్లే సమయంలో గేదెలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే సంబంధించిన అధికారులు స్పందించి తీగలను సరి చేయాలని విద్యుత్ శాఖ అధికారులను గ్రామ ప్రజలు కోరుతున్నారు.



నేలకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి



ఉప్పుగుండూరులో రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాగృతి వాసవీ క్లబ్ ప్రతినిధులు



సంతనూతలపాడులో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

సంతనూతలపాడు: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రాంగణంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంతనూతలపాడు మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు, రోశయ్య చిత్రపటానికి మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.వి.వి.మల్లికార్జునరావు, గౌరవాధ్యక్షుడు జి.శరత్‌బాబు, వాసవీ క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, జిల్లా ప్రతినిధి జీఎల్ ప్రసాదరావు, గౌరవాధ్యక్షుడు పాదర్తి గిరి, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో...

నాగులుప్పలపాడు: విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి కొణిజేటి రోశయ్య అని జాగృతి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అమరా సుబ్బారావు అన్నారు, మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా జాగృతి వాసవీ క్లబ్ ఉప్పుగుండూరు ఆధ్వర్యంలో శుక్రవారం రోశయ్య చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్, క్లబ్ ప్రతినిధులు ఆత్మకూరి వాసు, రాజేంద్ర, నాగేశ్వరరావు, చంద్రపాటి కృష్ణ, గుండా నారాయణ తదితరులు పాల్గొన్నారు.